క్లుప్తంగా

నందిగామ కమిషనర్‌గా ఈవీ రమణబాబు



నందిగామటౌన్: నందిగామ మున్సిపల్ కమిషనర్‌గా ఈవీ రమణబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న హేమ మాలిని బదిలీపై వెళ్లడంతో ఆస్థానంలో పల్నాడు జిల్లా పిడుగురాళ్ల నుంచి రమణబాబు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా కమిషనర్ రమణబాబు మాట్లాడుతూ పట్టణంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో పట్టణాభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. క్లీన్ నందిగామ గ్రీన్ నందిగామ ధ్యేయంగా పనిచేస్తామన్నారు. ముఖ్యంగా పట్టణంలోని సమస్యలపై దృష్టిసారించి పారిశుధ్యం మెరుగుదల పనులు చేపడతామని వివరించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామని తెలిపారు.

పెనుగంచిప్రోలు ఎస్ఐగా అర్జున్



పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు ఎస్ఐగా ఎంఎస్‌కె అర్జున్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన పి.రాంబాబు బదిలీ కావటంతో ఆస్థానంలో రాజమండ్రి నుంచి అర్జున్ బదిలీపై ఇక్కడికు వచ్చారు. ఈసందర్భంగా ఎస్ఐ అర్జున్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. అందరి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు. ముందుగా ఆయన గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు.

బాలికలకు రక్తపరీక్షలు



వీరులపాడు(కంచికచర్ల) : వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామంలో జిల్లా ఎనిమిమా టాస్క్‌ఫోర్స్ కమిటీ బుధవారం పర్యటించింది. ఈసందర్భంగా జిల్లా గణాంకాధికారి ఎస్.లక్ష్మీజి మాట్లాడుతూ రక్తహీనత తగ్గాలంటే పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. చదువుకునే బాలికల్లో రక్తహీనత అధికంగా ఉంటోందని, వారు సకాలంలో భోజనం చేయకపోవటమే ఇందుకు కారణమన్నారు. బాలికలు, మహిళలకు రక్తపరీక్షలు నిర్వహించి, హిమోగ్లోబిన్ శాతం పరీక్షించామన్నారు. రక్తశాతం తక్కువ ఉన్నవారు ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, కోడి గుడ్లు, రాగిజావ, చిక్కీలు తినాలన్నారు. ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేసుకోవాలని సూచించారు. డిపిహెచ్ఎన్ విన్నెట్ లిడియా, హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరెడ్డి, నర్సమ్మ ఎంఎల్ హెచ్‌పీ సాయికృష్ణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హోమియోపతి మందుల పంపిణీ



నందిగామ టౌన్ : మండలంలోని కోనాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విష జ్వరాల నివారణకు డాక్టర్ కాపా భానుప్రసాద్ విద్యార్థులకు ముందుగా రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం 300మంది విద్యార్థులకు మూడు డోసుల హోమియో మందులు పంపిణీ చేసినట్లు మాజీ జెడ్పీటీసీ సభ్యులు వాసిరెడ్డి ప్రసాద్ తెలిపారు.ఈసందర్భంగా డాక్టర్ భానుప్రసాద్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి మార్కపూడి వెంకట్రావమ్మ, స్కూల్ చైర్మన్ మార్కపూడి జాన్‌కోటయ్య, వైస్‌చైర్మన్ నాగశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక తరలించకుండా గాడి ఏర్పాటు



మల్కాపురం(జగ్గయ్యపేట): గ్రామంలోని మునేరు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిల్లకల్లు ఎస్సై తోట సూర్య శ్రీనివాస్ హెచ్చరించారు. గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలించకుండా బుధవారం సాయంత్రం మునేరుకు వెళ్లే మార్గంలో గాడి కొట్టించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి కూతవేటు దూరంలోనే తెలంగాణ రాష్ట్రం ఉండటంతో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని, ఈ విషయంపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీంతో రెవెన్యూ అధికారుల సహాయంతో గాడి కొట్టించామని తెలిపారు. గాడి కొట్టించడంతో వాహనాలు లోపలికి వెళ్లే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.

వైద్యసిబ్బందిపై దాడులు హేయం...



కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేయడం హేయమైన చర్య. అటువంటి వ్యక్తులను కఠినంగా శిక్షించాలి. వైద్యవృత్తిలో కొనసాగేందుకు మహిళలు ముందుకు రావడాన్ని అభినందించాలి. వైద్యసిబ్బంది భద్రతకు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలి.

– సీహెచ్ వరకృపా సమాధానం, స్టాఫ్‌నర్స్, లింగాలపాడు పీహెచ్‌సీ



నైట్ డ్యూటీ అంటే ఛాలెంజ్...



మహిళా వైద్యులు, సిబ్బంది నైట్ డ్యూటీ చేయాలంటే ఛాలెంజ్‌గానే ఉంటుంది. క్యాజువాలిటీ డ్యూటీలో రెస్ట్‌రూం గదులకు డోర్ క్లోజ్ కాకుండా గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. ఆసుపత్రుల్లో రాత్రిపూట సెక్యూరిటీ పెంచాలి. మహిళా వైద్యులు, సిబ్బంది డ్యూటీలు చేసేటప్పుడు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి.

– కె.రాజకుమారి, ఏఎన్ఎం, గంగ్రాయి

వైద్యులకు భద్రత కరువే

- రాత్రి పూట బిక్కుబిక్కుమంటూ విధులు
- అంతంత మాత్రంగానే రక్షణ చర్యలు
- ఆందోళనలో వైద్యులు, సిబ్బంది
- సీసీ కెమెరాల ఏర్పాటుకు డిమాండ్



కంచికచర్ల మండలం పెండ్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

కంచికచర్ల : దేవుడి తర్వాత ప్రాణం పోసే శక్తి వైద్యులకు మాత్రమే ఉంది. ఇక ప్రాణాపాయస్థితిలో ఉన్న వ్యక్తులపై ఆశలు వదులుకునేస్థితిలో ఉన్నవారిని సైతం మళ్లీ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మార్చి పునర్జన్మ ప్రసాదించిన వైద్యులకు కొదువలేదు. అయితే ఇటీవల కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ ఉదంతం వైద్యరంగంలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందిని ఆందోళనకు గురిచేస్తోంది. ఆసుపత్రుల్లో భద్రత, రక్షణపై వైద్యులు, సిబ్బందిని ఆలోచనలో పడేస్తోంది. ఆయా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేసే వైద్యసిబ్బంది బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. సరైన రక్షణ చర్యలు, నిఘా వ్యవస్థ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటోందోనని ఆందోళన చెందుతున్నారు.

డివిజన్‌లో 11 పీహెచ్‌సీలు..

నందిగామ డివిజన్‌లో 11 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, రెండు ఏరియా ఆసుపత్రులు, నాలుగు అప్పర్ ప్రాథమిక ఆసుపత్రులు ఉన్నాయి. కంచికచర్ల మండలంలోని కంచికచర్ల, పెండ్యాల, వీరులపాడు మండలంలో వీరులపాడు, అల్లూరు, నందిగామ మండలంలో లింగాలపాడు, గోళ్లమూడి, చందర్లపాడు మండలంలో చందర్లపాడు, పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలంలో బూచవరంలో పీహెచ్‌సీలున్నాయి. ఈ పీహెచ్‌సీల్లో 100మందికి పైగా వైద్యసిబ్బంది పనిచేస్తున్నారు. కోల్‌కతా ఘటన నేపథ్యంలో పీహెచ్‌సీలో కొరవడిన మౌలికవసతులు, భద్రతా చర్యలపై వైద్యసిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కంచికచర్ల, పెండ్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో మౌలికవసతులు లేకపోవడంతో విధులు నిర్వర్తించ లేకపోతున్నామని, దీనికితోడు సరైన భద్రతచర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

వైద్యసిబ్బంది వినతులు ఇవే..

- కంచికచర్ల, పెండ్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు ఏర్పాటు చేసిన ప్రహరీ గోడ ఎత్తు పెంచాలి.
- సెక్యూరిటీ రూమ్ ఏర్పాటు చేయాలి.
- పెండ్యాల పీహెచ్‌సీలో సరైన మరుగుదొడ్ల వసతికల్పించాలి.
- డాక్టర్లు, స్టాఫ్‌నర్సులకు విశ్రాంతి గదులు తగినన్ని లేవు, ఉన్నవాటిలో సర్దుకోవాల్సి ఉంటుంది, విశ్రాంతి గదులను నిర్మించాలి.
- కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి సక్రమంగా దారి లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సీసీరోడ్డు నిర్మించాలి.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



కోల్‌కతా ఘటనకు సంబంధించిన మృగాళ్లను ప్రభుత్వాలు కఠినంగా శిక్షించాలి. ఆసుపత్రులో ప్రతి రూముల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. మహిళా వైద్యులు ఏదైనా సమస్యపై ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ కె.మధురిమ, కంచికచర్ల పీహెచ్‌సీ

పనిచేసే చోటే రక్షణ, గౌరవం లేకపోతే ఎలా...



వైద్యులు, వైద్య సిబ్బందిపై జరిగే దాడులకు అడ్డుకట్ట వేయాలి. పనిచేసే చోట రక్షణ, గౌరవం ఉండాలి. పదిమందికి ప్రాణంపోసే వృత్తిలో ఉన్న వైద్యురాలిని అత్యాచారంచేసి హత్య చేయడం బాధాకరం, మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు తెచ్చినా తక్కువే.

– డాక్టర్ జెస్సీ లివింగ్‌ఫెయిత్, పెండ్యాల పీహెచ్‌సీ

మద్యం తాగి ఆస్పత్రులకు రావొద్దు..



ఆసుపత్రికి వచ్చే రోగుల వెంట కొంతమంది మద్యం తాగి వస్తున్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలి. ప్రాణాలు కాపాడే వైద్యులకు రక్షణ లేకపోతే సక్రమంగా విధులు నిర్వర్తించలేకపోతున్నాం. రోగుల ప్రాణాలను కాపాడే వైద్యసిబ్బందిని చులకనగా చూడరాదు.

– డాక్టర్ బేబీరాణి, లింగాలపాడు పీహెచ్‌సీ

గ్రామాల్లో ఫీవర్ సర్వేలు



వత్సవాయిలో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది



లింగాలలో జ్వరాలపై ఇంటింటి సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

వత్సవాయి : 'గ్రామాల్లో జ్వరాల విజృంభణ' శీర్షికన మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి వైద్య సిబ్బంది స్పందించారు. వైద్యాధికారి హర్షిదాబేగం ఆధ్వర్యంలో వత్సవాయి, మక్కపేట, భీమవరం, కంభంపాడు గ్రామాల్లో వైద్యసిబ్బంది బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. జ్వరాల బారినపడిన వారిని పరీక్షించి వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి హర్షిదాబేగం మాట్లాడుతూ జ్వరం వచ్చి వెంటనే తగ్గకపోతే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని వారి దగ్గరకు వెళ్లాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. నివాసప్రాంతాల్లో మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలని, తాగిపడేసిన కొబ్బరిబొండాలు, పాతటైర్లు నివాస ప్రాంతాల్లో లేకుండా తొలగించాలని సూచించారు. పారిశుధ్య చర్యల్లో భాగంగా దోమల నివారణ కోసం గ్రామాల్లో ఫాగింగ్ చేయిస్తున్నట్లు ఆమె వివరించారు.

విజయవాడకు ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభం



ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, రఘురామ్, రజని

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నుంచి విజయవాడకు నూతనంగా ఏర్పాటు చేసిన ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసును ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బుధవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.రఘురామ్‌తో కలిసి ప్రారంభించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడ వెళ్లేందుకు ఐదు ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు మంజూరుకాగా, తొలుత ఓ సర్వీసును ప్రారంభించామన్నారు. మరో మూడువారాల్లో మిగిలిన నాలుగు బస్సులను ప్రారంభిస్తామని వివరించారు. బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని చేయాలని డిపో అధికారులను ఆదేశించారు. ఆర్‌వో వాటర్ సదుపాయం కల్పించాలని, సిబ్బందికి మధ్యాహ్న భోజన విరామగది ఏర్పాటు చేయాలని సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ రజని, డిపో సూపరిండెంటెంట్ నాగేశ్వరరావు, డిపో యూనియన్ నాయకులు గంటా భాస్కర్, పసుపులేటి శ్రీనివాస్, సూపర్‌వైజర్లు వాణి, పాషా, నాయకులు, కౌన్సిలర్లు, ఆర్టీసీ డిపో సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య అధ్వానంపై ప్రత్యేకాధికారి ఆగ్రహం



గ్రామంలోని ఎస్సీకాలనీలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి మహేశ్వరరావు

అన్నవరం(జగ్గయ్యపేట):మండలంలోని అన్నవరం గ్రామంలో పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా ఉండటంపై మండల ప్రత్యేకాధికారి జి.మహేశ్వరరావు, పంచాయతీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన బుధవారం అన్నవరం గ్రామంలో పలుశాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రైయినేజీల్లో పూడిక తీయకపోవడంతోపాటు పలు వార్డుల్లో రోడ్లపై మురుగు నీరు నిల్వ ఉండటంపై పంచాయతీ సిబ్బందిని ప్రశ్నించారు. మన ఇళ్ల వద్ద పరిసరాలు కూడా ఇలా ఉంచుకుంటామా అంటూ సిబ్బందిని నిలదీశారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాడు–నేడు పథకం కింద అదనపు తరగతి భవనం పనులు మధ్యలో నిలిచిపోవడంపై హెచ్‌ఎంను మందలించారు. నిధులు ఉన్న ఎందుకు పనులు నిలిపివేశారని, రెండురోజుల్లో పనులు ప్రారంభించాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న ఏపీ ఫైబర్‌నెట్ బాక్స్ ప్రమాదకరంగా ఉందని, చిన్నారులు ఇబ్బందులు పడతారని వెంటనే తొలగించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. వైద్య సిబ్బంది గ్రామంలో ఫీవర్ సర్వేను పూర్తిస్థాయిలో నిర్వహించి జ్వర పీడితులకు వైద్యం అందించాలన్నారు. ఇప్పటికే గ్రామంలో ఓ మహిళ డెంగీ జ్వరంతో బాధపడుతున్నందున, జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇది ఇలా ఉండగా పంచాయితీ ఇన్‌చార్జి కార్యదర్శి శివాజి మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి ఏటా ఆయా గ్రాంట్ల నుంచి అందే నిధులు రూ.10లక్షలతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ఇంటి పన్నుల ద్వారా రూ.1.20లక్షల ఆదాయం రావలసి ఉండగా రూ.20వేలు వసూలు అవుతున్నాయని వివరించారు. ప్రత్యేకాధికారి స్పందిస్తూ ప్రత్యేక సిబ్బంది ద్వారా ఇంటి పన్నులు వసూలు చేయాలని కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్‌బాబు, తహశీల్దార్ ఎస్ నాగరాజు. గ్రామ ప్రత్యేకాధికారి సువర్ణ, హౌసింగ్ డీఈ శివాజీ, ఏపీవో రామకృష్ణ, వైద్య సిబ్బంది వెంకట్రావు, నాగలక్ష్మి, చంద్రిక, త్రివేణి, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు : కమిషనర్



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని ప్రధాన రహదారులు, ప్రధాన కూడళ్లలో ఆవులు, పందుల సంచారాన్ని నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు బుధవారం తెలిపారు. యజమానులు తమ ఆవులను తమ ఇంటి ఆవరణలో, పందులను పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంచుకోవాలని సూచించారు. సెప్టెంబరు 10వ తేదీ వరకు వీరికి గడువు ఇస్తున్నామన్నామని, ఆ తర్వాత రోడ్లపై సంచరించే ఆవులు, పందులను మున్సిపల్ సిబ్బంది స్వాధీనం చేసుకుని సమీపంలోని అడువుల్లో వదిలిపెడతారని వివరించారు. ఆవులు, పందులు రోడ్లపై సంచరించకుండా యజమానులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఐదుగురికి గాయాలు

కంచికచర్ల : ఓ కారు మరో కారును ఢీకొనడంతో ఐదుగురు వ్యక్తులు గాయపడిన సంఘటన కంచికచర్లలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు హైదరాబాద్‌కు చెందిన బొప్పన పరమేశ్వరరావు తన కుటుంబసభ్యులతో కలసి విజయవాడలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరై తిరిగి వెళ్తుండగా, స్థానిక సాగర్ కాల్వ సమీపంలో హైదరాబాద్ వైపు నుంచి రాంగ్‌రూట్‌లో వస్తున్న మరో కారు ఢీకొంది. ఈఘటనలో కారులో ప్రయాణిస్తున్న బొప్పన సహస్ర తీవ్రంగా గాయపడగా, మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న నేషనల్ హైవే అంబులెన్స్ వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లెక్చరర్ పోస్టులు భర్తీచేయాలి : ఎస్ఎఫ్ఐ



కంచికచర్లలో ఆర్ఐకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కంచికచర్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపీనాయక్ డిమాండ్ చేశారు. కళాశాలలోని సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకు ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం ఓ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ హైవే నుంచి కళాశాలకు వెళ్లే రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు పథకం అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. హాస్టల్స్‌లోని సమస్యలు పరిష్కరించాలని, విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. నాలుగు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మాధవ్, గోపి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆయా పోటీల విజేతలు వీరే



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జగ్గయ్యపేట అర్బన్: గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలో రసమయి సాహితీ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, శతక పద్యాల పోటీలు నిర్వహించారు. పట్టణ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

విజేతల వివరాలు..

వ్యాసరచన పోటీలో సీనియర్ విభాగంలో పి.కీర్తి (విజేత స్కూల్), బి.తరుణ్‌కుమార్, (విజ్ఞాన్ స్కూల్), సాత్విక(శ్రీమేధా స్కూల్) వరుసగా వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకోగా, జూనియర్ విభాగంలో షేక్ జోయా (శ్రీమేధా), బి.వర్షిత్ (విజ్ఞాన్), టి.ధృతిక(నారాయణ), కె.కీర్తి(విజేత) వరుసగా విజేతలుగా నిలిచారు. వక్తృత్వ పోటీల సీనియర్స్ విభాగంలో వై.భవ్యసత్యశ్రీ,(విజ్ఞాన్), సాత్విక(శ్రీమేధా), మేని మేఘనా(నారాయణ), జూనియర్స్ విభాగంలో మనోజ్ఞ(శ్రీమేధా), వై.కీర్తన(విజ్ఞాన్), శ్రీరాం ధనుంజయ్(విజేత), శతక పద్యాల పోటీల సీనియర్స్ విభాగంలో పావని (విజ్ఞాన్), ఎస్‌కే.నసీమా(విజ్ఞాన్), ఎస్.కోమలి (విజ్ఞాన్) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. జూనియర్ విభాగంలో పి.మల్లేశ్వరి(కె.అగ్రహారం యూపీ స్కూల్), పి.శ్రావణి(కె.అగ్రహారం యూపీ స్కూల్), ఐశ్వర్య(విజ్ఞాన్), శ్రీలత(కె.అగ్రహారం యూపీ స్కూల్) వరుసగా బహుమతులను కైవసం చేసుకున్నారు. ఆయా పోటీలను రసమయి సాహితీ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, రచయిత దోసపాటి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఏలూరి ఆశ, సురుగుల త్రివేణి ప్రకాష్, రామయ్య పర్యవేక్షించగా, గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ, సిబ్బంది పాల్గొన్నారు. విజేతలకు గురువారం గ్రంథాలయంలో బహుమతులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) చేతుల మీదుగా అందజేస్తామని దోసపాటి వివరించారు.


ఇసుక స్టాక్ పాయింట్ ఆకస్మిక తనిఖీ



ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న జిల్లా అధికారి ఆర్.వెంకటేశ్వర్లు

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): మండలంలోని అనుమంచిపల్లిలో జాతీయ రహదారి పక్కనున్న ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ర్యాంప్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని జిల్లా శాండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆర్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఇసుక స్టాక్ పాయింట్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇసుక స్టాక్ వివరాలను సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్టాక్ పాయింట్‌కు సంబంధించి షేర్‌మహ్మద్‌పేట గ్రామ సచివాలయంలో లబ్ధిదారులకు కూపన్లు అందజేస్తున్నట్లు వివరించారు. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రెండు షిఫ్టులుగా సిబ్బంది విధుల్లో ఉండి కూపన్లు జారీచేస్తారన్నారు. కూపన్లు పంపిణీలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. స్టాక్ పాయింట్ వద్ద ట్రాక్టర్లు ఇసుక లోడింగ్‌కు వెళ్లే మార్గం అధ్వానంగా ఉండటంతో వాహనాలు రాకపోకల ఇబ్బందిగా ఉంటుందని గుర్తించామని, సమస్యను పరిష్కరించేందుకు ర్యాంప్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మైనింగ్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, పంచాయతీ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. అనంతరం వత్సవాయి మండలంలోని పోలంపల్లి ఇసుక స్టాక్ పాయింట్‌ను కూడా పరిశీలించారు. ఇసుక నాణ్యత లేకపోవడంతో లబ్ధిదారులు ఎవరు ముందుకు రావడంలేదని వెంకటేశ్వర్లు వివరించారు.

వీరులపాడు ఎస్ఐగా అనిల్



వీరులపాడు(కంచికచర్ల) : వీరులపాడు ఎస్ఐగా జి.అనిల్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ మహాలక్ష్మణుడును వీఆర్‌కు పంపించగా, ఆస్థానంలో అనిల్ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఎస్ఐ అనిల్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. జూదం, అక్రమ మద్యం, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళలను చులకనగా మాట్లాడినా, వేధింపులకు గురిచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రూ.లక్ష విరాళం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని పాలేటి తీరాన వేంచేసియున్న మఠం శివాలయం పునర్నిర్మాణానికి భక్తులు పేరూరి వెంకటలక్ష్మి, నరసింహారావు దంపతులు రూ.1,00,116 విరాళం అందజేశారు. ఈ మేరకు నగదును ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



నందిగామ టౌన్ : మండలంలోని పెద్దవరంలో లింగాలపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యసిబ్బంది బుధవారం పర్యటించారు. గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించి 150మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు.ఈసందర్భంగా సీహెచ్ఓ మంగలపూడి భిక్షాలు మాట్లాడుతూ జ్వరాలబారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇళ్ల ముంగిట మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. జ్వరం వస్తే సమీపంలోని పీహెచ్‌సీలలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ముందుగా రక్తపరీక్షలు చేయించుకోవాలని, పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.